# కావియువి పిట్టాలు

"రైలు గంటన్నర లేటట అమ్మగారూ!"
—అన్నాడు లైసెన్సు కూలీ. ఉలిక్కి పడ్డదల్లా ఫుస్సురుమంటూ కుర్చీలో కూలబడింది కాంత. సాయంత్రం ఆరుగంటల నుండీ ఆ వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని వుండేమో, మరీ విసుగనిపించింది కాంతకు. ఆ బండివచ్చేది రాత్రి పదికయినా, తనున్న పల్లెనుండి వచ్చేందుకు ఆరుకు తప్పితే మళ్లీ బస్సులేదు. గంట పది దాటింది. తన సామానంతా ఒకసారి చూచుకుని వచ్చే నిద్రను ఆపుకుంటూ కూర్చుంది.

అంతలో ఒక పెద్దావిడ ఒంటి నిండా నగలతో వచ్చి కాంత ప్రక్క కుర్చీలో కూర్చుంది. తనెక్కడికి వెళ్లేది చెప్పి కాంతనూ అడిగి తెలుసుకుంది. మెల్లగా సంభాషణ సాగుతూ వుంది. మాట్లాడుతూ వుందే కాని పెద్దావిడచూపంతా కాంత మెడవైపే వుంది. పవిటచెంగు నిండా కప్పుకునివున్న కాంత వివాహితో, అవివాహితో ఆమెం అర్థం కాలేదు. అడిగే చనువూ లేదు. తెలుసుకోవాలనే ఆత్రంకొద్దీ "ఒక్కదానివే వెళ్తున్నావా! అమ్మాయ్" అంది. ఇలాంటి వారితో సంవత్సరంనుండ కలసివున్న కాంత "ప్రక్కన మొగవారి వెయిటింగ్ రూమ్‌లో మావాళ్లున్నారండీ!" అన్నది తడుముకోకుండా. ఆడపిల్ల ఒంటరిగా ప్రయాణం చేయటం తప్పు యిలాంటి పెద్దలకు. వారికి తగ్గట్టుగానే జవాబు చెప్పటం నేర్చుకుంది కాంత. బండిరాగానే లేపమని ఆవిడ కునుకు తీసింది. పరధ్యానంగా ప్లాట్ ఫారంవైపు చూచినకాంత హఠాత్తుగా సంభ్రమాశ్చర్యాలలో మునిగిపోయింది. ఒంటరిగా నిలబడి తదేకంగా తనవైపుచూస్తున్నదివెవరు? అతను ఎవరు? అతడే! అతడే! అంటూంది హృదయం గోలగా! "కాస్తాగు" అని ఆజ్ఞాపిస్తోంది ఆత్మ. అతను కాకపోతే తన వైపెందుకు అలా చూస్తాడు. అతను యెంత మారినా అతని గడ్డంక్రింది పుట్టుమచ్చ అతను అతడేనని దృఢపరుస్తోంది. కాంత పెదవులు కదులుతున్నాయి కాని శబ్దంమటుకు రావడం లేదు. గుండె పంజాబ్ మెయిల్‌తో సమానంగా కొట్టుకుంటూవుంది. ప్రక్కావిడ మంచినిద్రలో వుంది కాబట్టి కాంత కేమీ

## ఇ. హేమలత

ఆటంకం కలుగలేదు. అతడక్కడినుండి వెళ్లే వరకూ చూస్తూనే వుంది. వెళ్ళగానే మళ్ళీ కన్పించడేమోననే భయం పట్టుకుంది. ఎన్నేళ్ళయింది అతన్ని చూసి? పన్నెండేళ్ళ క్రిందట...

పన్నెండేళ్ళక్రిందటి మాట. సాయంత్రం నాలుగున్నరయింది. హైస్కూలు వదిలారు. ఆటల్లో యిష్టమున్నవారు ఆడుకుంటున్నారు. పొరుగూరు వెళ్ళాల్సినవారు వెళ్తున్నారు. ఫోర్తుఫారంలోవున్న "బావా, మరదళ్లు" రఘు, కాంతలు కూడా పొరుగూరు వారే. ఆ పల్లెకు వెళ్లాల్సినవారు వారిద్దరే. మూడు మైళ్ళు నడవాలి. ఆ రోజు క్లాసులోని సంగతులు చెప్పుకుంటూ సరదాగా వెళుతున్నారు. మధ్యలో "రేపు ఇంగ్లీషుపాయిట్రీ వుంది బావగారూ!" హేళనగా కాంత. "ఆ తర్వాత పీరియడ్‌లో లెక్కలున్నాయి మరదలూ" అన్నాడు రఘు వెంటనే. ఇంగ్లీషంటే రఘు కెంత కష్టమో కాంత కంత సులభం. లెక్కలంటే కాంతకు గొంతు పట్టుకుంటుంది. రఘున్న మాటకు "లెక్కల్లో నాకేం సున్నాలు రావటంలేదే" అంది కసిగా. ఆ మాటతో రఘుకోపం తారా పథానఅంటుకుంది. "ఏడిశావ్ లే పనిలేకుండా బట్టీపెడితే నాకూ వస్తయ్ అరవైలూ, డెభ్భైలూ" అన్నాడు. పద్యాలంటే బట్టీపడ్తావ్, పాఠాలెందుకు రావూ?" అంది కాంత. రఘువుడికి పోతూన్నాడేమో, "మహా నేర్చావులే. రేపు వంటింట్లో వుద్యోగం చేయటానికి" అన్నాడు వెక్కిరిస్తూ. కాంత రెచ్చిపోయి, ప్రక్కనే నడుస్తున్న రఘు చేతిని గట్టిగా కొరికి పరుగు తీసింది. సమాన వయస్కులయినా, మొగపిల్లాడికి చిక్కకుండా పరుగెత్తగలదా, ఆడపిల్ల. చేతికి చిక్కగానే యిష్టవచ్చినట్లు, కసితీరా కొట్టాడు కాంతను. వెక్కి, వెక్కి యేడుస్తూ "ఇంటికిరా మావయ్యకుచెప్పి యేం చేయిస్తానో" అంటూ రఘు వచ్చేదీ లేనిదీ చూడకుండా యిల్లు చేరింది. కాంత యేం చెప్పినా వేదవాక్యంగా పాటిస్తారు రఘు, తల్లిదండ్రులు. అందులోనూ కాంత రఘుకన్నా తెలివైంది కొట్టటంవల వచ్చింది ముప్పంతా. ఏడుస్తూపోతూవుంటే, యెందుకంతగా కొట్టానా అనిజాలి పడ్డాడు. చేతిమీద కాంత కొరికిన గాట్లు మంటపుడుతున్నాయి. ఇంటికెళ్తే తన గతి యేమాతుందో చెప్పనక్కర్లేదు. తండ్రిని తల్చుకోగానే వణుకు పుట్టింది. అంతే వెనక్కు తిరిగాడు. మళ్ళీ ఆనాటి కీనాడే కనుపించడం.

ఫస్టు బెల్ కొట్టారు. కాంత ఆలోచనలలోనుండి తేరుకుని లేచి నిలబడింది. అత్తయ్యా మావయ్యా చేయించిన ప్రకటనలన్నీ వృథా అయ్యాయి. ఇతడు నిజంగా రఘు అయితే నిరాశతో జీవించే ఆ వృద్ధులెంత సంతోషిస్తారో. కూలీ వచ్చాడు. పెట్టె, బెడ్డింగ్ వాడికిచ్చి, సూట్ కేస్ తీసుకుని, ప్రక్కావిడను లేపింది. ఆవిడ వాళ్ళ మొగవారు రాగానే వెళ్లింది.

సెకండ్ క్లాస్ కంపార్టుమెంటులో కూర్చుని ప్లాటుఫారమంతా కన్పడినంత వరకూ అతని కోసం చూసింది. అతడు



ఎక్కడవున్నాడో అనుకుంటూ, పెట్టెలో ఎవరెవరున్నారో అని యిటు తిరిగింది. తను భ్రమపడ్డం లేదుకదా! లేదు. తను తెలివిగానే వుంది. తన యెదురు బెర్తుపై అతను కూర్చునివున్నాడు. ఎంతసేపటినుండీ తన్ను చూస్తున్నాడో. తను చూడంగానే ముఖం త్రిప్పుకున్నాడు. కాంతకు "వెతకబోయిన తీగ" సామెత గుర్తుకొచ్చింది. సందేహం లేదు. అతడు తన బావ రఘే! అతడు తప్పకుండా తమవూరికే వస్తున్నాడని నిర్ధారణ చేసుకుంది. ధైర్యంగా కిటికీపై తల ఆన్చి నిద్రపోయింది.

కాంతనిద్ర రఘుకు బాగా వుపకరించింది. తన యెదురుగుండా ప్రశాంతంగా నిద్రపోతున్న కాంతని బాగా గుర్తించాడు. మనిషి నిర్మలంగా, తీర్చి దిద్దినట్లుంది. బ్లూకాటన్ బ్లౌజ్ వంటికి పట్టినట్లుంది. బోర్డర్ లేని క్రీమ్‌కలర్ క్రేప్ చీర సామాన్యంగా వుండి నిరాడంబరతను సూచిస్తూవుంది. ఆ పెద్దావిడను మాదిరిగానే రఘుకూడా కాంత శ్రీమతో కుమారో తెలుసుకోలేక పోయాడు. తమ వేషభాషలవల్ల అందరికళ్లూ తమవెపు తిరగాలనుకునే నేటి యువతులకు పూర్తిగా వ్యతిరేకంగా వుంది కాంత. ఆ నిర్మలత్వమే రఘు నెంతో ఆకర్షించింది. తనివితీరా చూస్తూ నిద్రకు లోనయ్యాడు రఘు.

ఏదో స్టేషన్ వస్తే నలుగురైదుగురు ఎక్కారు. వారిగోలకు కాంత మేల్కొంది. అతను ఎడమచేతిని తలక్రింద పెట్టుకొని నిద్రపోతున్నాడు. రిస్ట్‌వాచ్‌కి పైగా ఏదో బ్రాకెట్ గుర్తు కన్పించింది. అదేమిటో తెలుసుకోవాలని మెల్లగా చూస్తూ తలుపుదాకా వెళ్ళి వచ్చింది. కాంత అనుకున్నది నిజమే అయింది. అదే ఆనాడు తను రఘును కొరికినచోటు. దాని ఫలితంగా ఏర్పడ్డ మచ్చఅది. కొన్నికొన్నప్పుడు పెద్దగాయాలు తగిలినా యేర్పడని మచ్చలు, కొన్ని సమయాల్లో చిన్నగా గిల్లినకూడా జీవితాంతం జ్ఞాపకార్థంగా వుండిపోతాయి. అలాటిదే రఘు చేతిపై మచ్చకూడా! ఆమచ్చ లైటు వెలుతురులో స్పష్టంగా కన్పిస్తూవుంది. లేపి మాట్లాడాలనే ఆత్రం కాంతలో ఎక్కువైంది. కాని గుండె విపరీతంగా కొట్టుకుంటూవుంది. తోటి ప్రయాణీకులంతా గాఢనిద్రలో వున్నారు. ఎంత ప్రయత్నించినా పెదవి కదపలేకపోయింది. లేచి పలకరించకపోతాడా అనే ఆశతో ఆలోచిస్తూ కూచుంది.

ఆరోజు బావ, "నేర్చావులే ఇంగ్లీషు, కంటెంట్లో వుద్యోగం చెయ్యటానికి" అన్నమాటే కాంత యిప్పుడీ పరిస్థితుల్లో వుండడానికి కారణం. పట్టుబట్టి స్కూల్ ఫైనల్ పూర్తిచేసి, దూరమయినా లెక్కచెయ్యక, వచ్చిన అవకాశాన్ని వదలక స్వగ్రామానికి దూరంలో "గ్రామసేవిక" ఉద్యోగం చేస్తూవుంది. ఆ పల్లె యువతులకు [illegible] ప్రశాంతంగా వుండనుకునేది. కానీ బావను చూడగానే తన్ను తను మోసపుచ్చుకుంటున్నానేమో అనుకుంది. సెలవులమీద ఇంటికి పోతూ యిలా బావను కలుసుకోవడం ఎంతో అదృష్టమనుకుంటూ సంబరపడ్తూ వుంది. ఇన్నాళ్ళూ తల్లిదండ్రులు పెళ్లి చేస్తామంటే, "బావ రానీ!" అనేది, ఆ బావ వస్తాడో రాడో తెలియకపోయినా అయినే ఎప్పటికయినా 'నా పెళ్లి బావతోనే' అనుకునేది. అలాంటిది కళ్లెదురుగుండా బావ కన్పిస్తుంటే నోరువిప్పి మాట్లాడలేక పోతూ వుంది.

ప్రక్కస్టేషనే తను దిగవలసింది. ధైర్యం చేసి లేపుదామనుకుంటుండగానే, అతనే లేచి బాగ్ చేతికితీసుకున్నాడు. కాంత లేచి నిలబడింది. ఇంకా బాగా తెల్లారలేదు. మసకచీకటిగా వుంది. నాన్న తనకోసం బండి పంపివుంటారు. బావతో కూడా కలిసి వెళ్ళి అందర్నీ ఆనందంలో ముంచెయ్యాలి; అనుకుంటూ, సంతోషంతో వూహాగానాలు చేస్తూవుంది కాంత. కాని, అతనింకా పలకరించలేదేఅని ఎదురుచూస్తూవుంది. స్టేషన్ వచ్చింది. సామానుతో కూడా కాంత దిగింది. ఆమె వెనుకే అతనూ దిగాడు. కానీ... అతను కాంతవెపు కన్నెత్తి చూడకుండా ప్రక్కలైనుపై రెడీగావున్న ట్రైనెక్కాడు. కాంత నిలువుగుడ్లతో అచేతనంగా నిలబడిపోయింది. తన్ను దింపినబండి కదలిపోయింది. నిర్వికారంగా పట్టాలవంక చూస్తూ "కలియని పటాలు" అనుకుంటూ కళ్లనిండా క్రమ్ముకున్న నీటెని వణికే చేతులతో తుడుచుకుంది. తనచుట్టూవున్న పరిసరాల్నే మరచిపోయి అలానే నిలబడివున్న కాంతను, వాళ్ళ పాలేరు రామయ్య యీ లోకంలోకి తెచ్చాడు.

కోడెలబండి మువ్వల గలగలలతో జోరుగా పోతూవుంది. ఆ పోవడం మరో సమయంలో అయివుంటే, కాంత "పరుగులు తీయాలి" అంటూ పాట అందుకునేదే. కానీ, కాంత హృదయం విషాద గీతిని ఆలపిస్తోందిప్పుడు. ఉన్నట్టుండి "రామయ్యా! రైలు పట్టాలు ఎక్కడా కలవవు కదూ!" అంది. ఆ ప్రశ్న అర్థంకాక "స్టేషన్ దగ్గర కలుస్తాయిగదండీ! అన్నాడు రామయ్య అమాయకంగా! "అవునవును లూప్‌లైన్ దగ్గర కలుస్తాయి. మళ్ళీ కాస్తలోనే విడిపోతాయి. అలాటివే మా జీవితాలు వంతాలతో పతనమయ్యాయి." తనలో తను అనుకుంటూ, గుడ్లనీరు కుక్కుకుంది, కాంత.

రఘు కాంత స్టేషన్‌నుండి వెళ్ళేవరకూ బండిలోనుండి చూస్తూనే వున్నాడు. అనుకోకుండా కలుసుకున్న కాంతను గుర్తుపట్టీ కూడా పలకరించనందుకు అతనికీ బాధగానే వుంది, గతమంతా మదిలో మెదిలినా అన్నాళ్ళ వారంతా జ్ఞాపకమొచ్చినా కూడా, అతడు చలించలేదు. కారణం! అతనిప్పుడు ఓ గృహస్థు. అంతేకాక ఒక పాపకు తండ్రీ, సంపాదన పరుడుకూడా! తన్నింతవాణ్ణి చేసి, తమ కన్యనిచ్చి ఓ యింటివాణ్ణి చేసిన పంజాబీ కుటుంబాన్ని అన్యాయం చేయాల్సి వస్తుందనే భయంతో కాంతను కదపలేదు. అతనిలో కూడా "లూప్‌లైన్" "కలయని పట్టాలు" మెదిలాయి. శాంతంగా నిట్టూరుస్తూండగా బండి [illegible] కదిలింది.

★




